792) పాడి

ప|| నేడు దప్పించుకొంటేను నేరుపున్నదా | వేడుక భోగించుతానే పెనగ జోటున్నదా ||

చ|| తనువు మోచిననాడే తప్పులెల్లా జేసితిని | వెనక మంచితనాలు వెదక నేది |
ననిచి సంసారినైననాడే నిష్టూరానకెల్ల | మునుపనే గురియైతి మొరగ జోటున్నదా ||

చ|| సిరులు చేకొన్ననాడే సిలుగెల్లా గట్టుకొంటి | తరగాతిపను లింక దడవనేల |
నరలోకముచొచ్చిననాడే పుణ్యపాపముల | పొరుగుకు వచ్చితిని బుద్ధు లింక నేల ||

చ|| వూపిరిమోచిననాడే వొట్టికొంటి నాసలెల్లా | మాపుదాకా వేసరిన మాన బొయ్యీనా |
యేపున శ్రీవేంకటేశుడింతలో నన్ను గావగా | పైపై గెలిచితిగాక పంతమాడగలనా ||